క్లుప్తంగా

గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే



అలంపూర్ రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతున్నట్లు ఏఓ నాగర్జున్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కోనేర్, కాశీపూర్, బుక్కాపూరం క్లస్టర్లలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రాప్ సర్వేకు 5309 ఎకరాలకు గాను 4823 ఎకరాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు అయిజ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్- 2 ఫీడర్ పరిధిలోని టీచర్స్ కాలనీ, భరత్‌నగర్, కొత్త బస్టాండ్, నరసింహ కాలనీ, తెలంగాణ చౌరస్తా, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, మైలోనిగడ్డ కాలనీతో పాటు ఎక్లాస్‌పురం, దేవబండ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్త్ క్యాంప్ విజయవంతం

అలంపూర్: మండలంలోని లింగనవాయి రైతు వేదికలో బీఎస్టీ సంజీవని, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ జలీల్, అరవింద భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్, ఫార్మసిస్ట్ తస్లీమా భాను, ల్యాబ్ టెక్నీషియన్ నిరంజన్ 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎంయూ ఆపరేటర్ హాజీబాష, పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఆశ కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ఉంటా



అలంపూర్: పేద ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని ఎమ్మెల్యే శనివారం అందజేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన రాణి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం రాయచూర్ జిల్లా యాపల్‌దిన్నె గ్రామానికి చెందిన ఉమేష్ నూతన కల్యాణ మండప నిర్మాణానికి రూ.21 వేలు విరాళం అందజేశాడు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వరుడికి ఆరుద్ర పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో గల శివలింగానికి భక్తులు పాలాభిషేకం చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



విఠలాపురంలో మహిళాదినోత్సవ ర్యాలీలో పాల్గొన్న మహిళలు



అయిజలో కేక్ కట్‌చేస్తున్న మహిళలు



గద్వాలలో ప్రజాప్రిత బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో వేడుకలు



ఉండవెల్లిలో ఐద్వా ఆధ్వర్యంలో కేక్ కట్‌చేస్తున్న మహిళలు

చైతన్యంతోనే సాధికారత సాధ్యం

సాక్షి నెట్‌వర్క్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తేనే చైతన్యం ద్వారానే మహిళా సాధికారత సాధించవచ్చన్నారు. మహిళలు అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని నాయకులు అన్నారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి, ఆర్థిక స్వతంత్రం సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులు, కార్మికులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

■ గద్వాల పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకురాలు శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా ప్రజాప్రిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పాల్గొన్నారు. అదే విధంగా 37వ వార్డులో నిరుపేద మహిళకు బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిత్తారి కిరణ్ సొంత ఖర్చులతో కుట్టమిషన్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణవేణి, జయశ్రీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గద్వాలకు చెందిన సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు బ్లడ్ క్యాన్సర్‌తో హైదరాబాద్ ఆస్పత్రిలో బాధపడుతున్న విద్యార్థి గౌతమ్‌కి వైద్య ఖర్చులకు నిమిత్తం రూ. 52 వేల ఆర్థిక సాయం అందించారు.

■ అలంపూర్ పట్టణంలో సమ సమాజ సేవా ట్రస్ట్ సభ్యులు హరిజనవాడ పాఠశాలలో రాజ్యాంగా నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమరేందర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఏమేలమ్మ, సయ్యద్ బేగం, భారతి తదితరులు పాల్గొన్నారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్‌బీఐ సంజీవని, భవిష్యభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుభాషిణి వైద్యులు శివ కుమార్ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

■ సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌గని అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

■ మానవపాడు మండల పరిధిలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. అన్ని విధాలుగా మహిళలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ప్రవీణ్, రవి, మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జల్లాపురం గ్రామానికి చెందిన రత్నకుమారి మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూల్ పట్టణంలోని టీజీవీ కళాక్షేత్రంలో శ్రీ నటరాజ నృత్య కళామందిర్ అధ్యక్షుడు స్వరూప్ సిన్హా ఆధ్వర్యంలో నారీ శక్తి అవార్డు అందుకున్నారు.

■ ఉండవెల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

■ పురుషులతోపాటు మహిళలను సమానంగా చూడాలని సీఆర్‌పీఎఫ్ కార్యదర్శి హనిమిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మదర్స్ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మదర్స్ కమిటీ కన్వీనర్ యశోదమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

■ మల్దకల్ మండలంలోని విఠలాపురంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లావణ్య ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్త్రీ సృష్టికి మూలకారణమని, పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, మహేశ్వరి, నర్సమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

■ గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో మహిళలు తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లావణ్య, మహేశ్వరమ్మ, కార్యదర్శి వెంకటమ్మ, మహిళలు పాల్గొన్నారు. అలాగే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో పని చేస్తున్న మహిళలను కేవీపీఎస్ నాయకులు సన్మానించారు. బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మండలంలోని బల్గెరలో నిర్వహించిన వేడుకల్లో మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌టీఐమైండ్ ట్రీ, భవిష్య భారత్ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు.

■ అయిజ మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. బింగుదొడిలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో మహిళలను శాలువా, పూలమాలలతో సత్కరించారు.



బింగుదొడ్డిలో మహిళలకు సన్మానం



శాంతినగర్‌లో కేక్ కట్‌చేసి మహిళల సంబరాలు



గద్వాలలో..



గట్టు ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న కేవీపీఎస్ నాయకులు



అలంపూర్‌లో మహిళలను సన్మానిస్తున్న సమ సమాజ ట్రస్టు సభ్యులు



బల్గెరలో మహిళలను సన్మానించిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు



గద్వాలలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అయిజ: కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, హామీలు నెరవేర్చకుంటే నిరసన సెగలు తప్పవని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, విద్యార్థినులకు స్కూటీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుంటే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కార్యర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భగత్‌రెడ్డి

బస్సు సౌకర్యం కల్పించాలి



ఉండవెల్లి: జోగుళాంబ రైల్వే స్టేషన్ నుంచి బస్సు సదుపాయం కల్పించాలని ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిత్యం వందలాది మంది రైలు కోసం ప్రైవేటు వాహనాల్లో రావాల్సి వస్తుందని వాపోతున్నారు. బస్సు సదుపాయం లేక ప్రైవేటు వాహనదారులు అధికంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందంటున్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నేడు మల్లికార్జునస్వామి రథోత్సవం



ఉత్సవానికి ముస్తాబవుతున్న రథం



ముస్తాబవుతున్న ఆలయం

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ శివారులో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి బిల్వార్చన, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ సముదాయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. రథాన్ని వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి వారిక కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

రక్షణ గోడలు నిర్మించండి

రాజోళి: సుంకేసుల డ్యాంపై ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు శిథిలమైపోతున్నా పట్టించుకునే నాథుడే లేరని ప్రయాణికులు, మండల ప్రజలు విమర్శిస్తున్నారు. డ్యాంపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు చేస్తుంటాయని ఎప్పుడు ఏ ప్రమాదంలో జరుగుతుందోని వాపోతున్నారు. 2009లో వరదల సమయంలో దెబ్బతిన్న డ్యాం పరిసరాలు నేటి వరకు బాగుచేయలేదంటున్నారు. దీనికి తోడు రోడ్డు కూడా గుంతలమయంగా మారడంతో వాహనాలు అదుపు తప్పే ప్రమాదముందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో రక్షణ గోడలు

విద్యార్థికి ఉన్నత లక్ష్యం ఉండాలి

అలంపూర్: ప్రతి విద్యార్థికి ఉన్నత లక్ష్యం ఉండాలని కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి పాఠశాల 22వ వార్షికోత్సవంలో కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే విజయుడులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు. ప్రతి విద్యార్థికి కృషి, పట్టుదలతో విద్యను అభ్యసించడంతోపాటు క్రమశిక్షణ ఉంటేనే ఉన్నత స్థాయిలో రాణించగలమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూల్ ఎంపీ నాగరాజు

రైల్వే రిక్వెస్ట్‌స్టాప్ ఏర్పాటు చేయాలి

మానవపాడు: మండల కేంద్రంలోని 119 స్టాప్ వద్ద రైల్వే రిక్వెస్ట్ స్టాప్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మహబుబ్‌నగర్ జిల్లా దివుటిపల్లి వద్ద శనివారం కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎంపీ డీకే అరుణకు మానవపాడు రైతు సంఘం అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, చిన్న అయ్యన్న, రాముడు, పరమేష్ నాయుడు, కాంతారెడ్డి, చోటా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికుల అభ్యర్థన మేరకు మాత్రమే రైల్వే స్టేషన్ కూడా ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ.. రిమాండ్‌కు తరలింపు

ధరూరు: పొలం పంచాయతీ విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడగా, ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండల పరిధిలోని దోర్నాల గ్రామానికి చెందిన నర్సింహులుపై పాత కక్షలు మనసులో పెట్టుకుని ఈనెల 6న గ్రామానికి చెందిన వాసు, కృష్ణ దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అన్నదాతల ఆశలు సజీవం

- ఇండెంట్‌తో ఆయకట్టు రైతుల్లో హర్షం
- పంటలకు అందిన చివరి తడులు
- వారంపాటు సాగునీటికి అవకాశం



ఆర్డీఎస్ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

రాజోళి: ఆర్డీఎస్ కెనాల్‌కు ఇండెంట్ ద్వారా నీరు విడుదల కావడంతో అన్నదాతల ఆశలు సజీవంగా ఉన్నాయి. గత వారం వరకు ఆర్డీఎస్ ఆయకట్టుపై రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు నీరు అందక రైతన్నలు విలవిలలాడారు. ఈ నేపథ్యంలో అధికారులు కెనాల్‌కు నీరు విడుదల చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లబోదిబోమన్న రైతులు..

గత వారంలో ఎగువ నుంచి నీరు రాకపోవడంతో కెనాల్‌లో నీరులేక పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న పంటలు ఆయకట్టు కింద సాగులో ఉన్నాయి. చివరి తడులు పెట్టాల్సిన తరుణంలో కెనాల్‌లో నీరు లేకపోవడంతో రైతులు లబోదిబోమన్నారు. ఆరుకాలం పండించిన పంట చేతికందే దశలో నాశనమైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్ పరిధిలో కొన్ని పంట ఎండుముఖం పట్టిందని పేర్కొన్నారు. పలుచోట్ల పక్కన పొలాల్లో ఉన్న బోర్ల నుంచి తడులు అందించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎగువ నుంచి సాగునీరు రావడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీరు లేక ఎండుముఖం పట్టిన జొన్న, మొక్కజొన్న పంటలకు ఊపిరి అందినట్లు అయిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరో వారంపాటు..

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరు అందాలంటే ఎగువ నుంచి వచ్చే ఒక్క ఇండెంట్ సరిపోకపోవడంతో ఏపీ-తెలంగాణ ఉమ్మడి ఇండెంట్‌ను మంగళవారం కలిసి పెట్టడంతో ఎగువ నుంచి నీరు విడుదల చేశారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మరో వారం పాటు ఆర్డీఎస్ కెనాల్‌లో నీటి ప్రవాహం ఉంటుందని రైతులు ఇబ్బందులు లేకుండా నీటి తడులు అందించుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. రైతులు కూడా ఇవే చివరి తడులుగా భావించి నీటిని అందించే పనిలో పడ్డారు.

ఆశలు వదిలేసుకున్నాం..



గత వారం దాకా నీరు విడుదల కాకపోవడంతో మొక్కజొన్న పంటపై ఆశలు వదిలేసుకున్నాం. మూడు రోజుల కిందట నీరు వదలడంతో మొక్కజొన్న పంటకు తడులు అందిస్తున్నాం. ప్రస్తుతం వదిలిన నీటితో పంట చివరి దాకా సరిపడే తడులు అందించవచ్చు.

-జనార్దన్, రైతు, గోకులపాడు

తడులు ఇస్తున్నాం..



చివరి ఇండెంట్‌గా కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటితో పంటలకు ప్రాణం పోసినట్లైంది. పశువుల గడ్డి, మొక్కజొన్న, జొన్న పంటలు కీలక దశలో ఉన్నాయి. మొక్కజొన్న, గడ్డికి తడులు అందిస్తున్నాం. నీరు విడుదల కాకుంటే తీవ్రంగా నష్టపోయేవాళ్లం.

- నర్సింహ గౌడ్, వెంకట్రామన్‌నగర్

వారం పాటు నీరందిస్తాం..

వారం రోజుల పాటు రైతులకు సాగునీరందిస్తాం. కెనాల్‌లో మరో మూడు రోజుల పాటు నీరు ప్రవహిస్తుంది. ఒక వేళ నదిలో నీరు తగ్గితే ఎగువ నుంచి వస్తున్న ఇండెంట్‌తో మళ్లీ కెనాల్‌కు నీరు అందించే అవకాశాలు ఉన్నాయి. గత వారం రోజుల క్రితం నీరు రావడం లేదని రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న నీటితో రైతులు తడులు అందిస్తున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- వరుణ్, ఆర్డీఎస్ ఏఈఈ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల | కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ | ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603